క్లుప్తంగా

పాల ఉత్పత్తిదారుని కుటుంబానికి ఆర్థిక భరోసా



పిట్టలవానిపాలెం: అల్లూరు సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారు బడుగు రామారావు ఇటీవల మృతి చెందారు. ఆదివారం అతని భార్య దానమ్మకు రూ.50 వేల నగదు చెక్కును, రూ.10 వేలు నగదు డెయిరీ యాజమాన్యం అందజేసింది. పాలక వర్గ సభ్యుడు మరీదు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ డీవీసీ అభయ పథకం ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించినట్లు వెల్లడించారు. అప్పికట్ల చిల్లింగ్‌సెంటర్ మేనేజర్ కాట నరేష్ బాబు, రూట్ సూపర్‌వైజర్ బాలకిషోర్, పాల ఉత్పత్తిదారులు, గ్రామస్తులు ఉన్నారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు



అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండల కేంద్రంలో వైఎస్సార్ సీపీ నాయకుల అధ్వర్యంలో ఆదివారం దళితవాడలోని బీఎఫ్ఎస్ పాఠశాలలో సన్ క్లినిక్ హాస్పిటల్ సహకారంతో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ రాపర్ల నరేంద్ర ప్రారంభించారు. 200 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. 50 మందికి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ బి.రాజేష్, సర్పంచ్ దేవర కొండ రాము, బర్మా ప్రవీణ్, గ్రామస్తులు ఆర్ ఎంపీ బాషా, కనగాల తేజ, తెనాలి రామారావు, కె.సాయిరామ్, కొండముది భాస్కర్, నలుకుర్తి అజయ్‌బాబు పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసిన శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ అధిక శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

ఉచిత వైద్యశిబిరాలు.. గ్రామీణులకు ఉపయోగం



కర్లపాలెం: ఉచిత వైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల వారికి ఉపయోగంగా ఉంటాయని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు తూనుగుంట్ల వెంకట సుబ్బారావు తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో పొన్నూరు బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఈ శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. డాక్టర్లు జి.అమృత, డి.వేణుకుమార్, కాశీవిశ్వనాథ్, నాగబాబు, స్పందన, ఆర్యవైశ్య సంఘం సభ్యులు లలితబాబు, గుప్త తదితరులు ఉన్నారు.

సేవకు అర్థం.. గ్రామ వలంటీర్

వలంటీర్లకు వందనం

బాపట్ల అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ సక్రమంగా అందుతున్నాయి అంటే దానికి ప్రధాన కారణం వాలంటీర్లే. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా వీరు పనిచేస్తున్నారు. ముఖ్యంగా ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేస్తుండడంతో వృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి పింఛను నగదు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ సొమ్ము తీసుకోవడానికి పెద్ద పోరాటం చేయాల్సి వచ్చేది. పంచాయతీ ఆఫీస్ వద్దకు ఉదయాన్నే చేరుకొని, క్యూలో ఉంటే పింఛన్ అందేసరికి మధ్యాహ్నం అయ్యేది. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ కష్టాలన్నీ తీరాయి.. పింఛను నుంచి సంక్షేమ పథకాల వరకు అన్నీ ఇంటి ముంగిటకే అందుతున్నాయి.

ఆస్పత్రికి వెళ్లి..



ఈమె పేరు కోటేశ్వరమ్మ. బాపట్ల మండలం మర్రిపూడి గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఈమెకు కాలు బాగోక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స తీసుకుంది. ఆమె పింఛన్ తీసుకోవడానికి గ్రామానికి రాలేకపోయారు. విషయం తెలుసుకున్న వలంటీర్ పులుగు నాగరాజు కోటేశ్వరమ్మ చికిత్స పొందుతున్న ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి పింఛను నగదు అందజేశారు. అంత దూరం వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్‌కు కోటేశ్వరమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సొంత బిడ్డలా ..



ఈ ఫొటోలో ఉన్న పెద్దాయన పేరు దమ్ము ప్రకాష్. డయాలసిస్ పేషెంట్. ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఇబ్బందులు పడుతున్నారు. వలంటీర్ గేరా సువర్ణలత విషయం తెలుసుకొని సీకేడీ పెన్షన్ రూ.10,000లను పెట్టించింది. పెన్షన్ ద్వారా వచ్చే నగదు ఎంతో ఉపయోగపడుతున్నట్లు పెద్దాయన దమ్ము ప్రకాష్ ఎంతో సంతోషపడ్డారు. సీఎం జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎనలేని సాయం



ఈ ఫొటోలో ఉన్న ఆమె పేరు సక్క వెంకాయమ్మ. ఈమెది బాపట్ల మండలం నరసాయపాలెం గ్రామం. అనారోగ్యం బాగా లేనందున గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ కాటి రాజేష్ గుంటూరు హాస్పిటల్‌కు వెళ్లి ఆమెకు పెన్షన్ నగదు అందజేశారు. వెంకాయమ్మ మాట్లాడుతూ గతంలో పింఛన్ తీసుకోవడానికి వెళ్లలేకపోతే ఆ నెల ఇంకా అందేది కాదు. కానీ ఇప్పుడు ఆసుపత్రిలో ఉన్నా.. పింఛను నగదు అందుతోంది.

సేవలు అద్భుతం



బాపట్ల మండలం విధులు పల్లి గ్రామ పంచాయతీలోని కొత్తపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నారు మేడిబోయిన చిన్న నాగూర్ రెడ్డి. వృద్ధాప్యం వల్ల తన పని తాను చేసుకోలేని పరిస్థితి. వృద్ధాప్య పింఛను రూ.2,750 అందుతుండటంతో తనకు ఎంతో ఉపయోగపడుతోందని వలంటీర్ శ్రీనివాసులు తనకు అన్ని రకాల సేవలు చేస్తున్నాడని ఆనందం వ్యక్తం చేశాడు. వృద్ధాప్యంలో ఉన్న మా లాంటి వాళ్లకు సీఎం జగన్ పెద్ద కొడుకులాగా పింఛను నగదు వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా తమకు అందజేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం

ఎమ్మెల్యే కోన రఘుపతి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ఎన్నుకున్న ప్రజలకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉండాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షా అని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఆదివారం బేతపుడి సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. పలు కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందకపోతే వారిని కూడా గుర్తించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే ముఖ్యమంత్రికి ప్రజలు వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందకపోతే.. అక్కడే ఉన్న అధికారులు, వలంటీర్లను అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు ఆదేశాలు ఇచ్చారు. నిరంతరం ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పరితపించే ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. బేతపూడి సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకున్న 750 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. బాపట్ల మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి జేసీఎస్ కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, బాపట్ల ఎంపీపీ చిన్న పోతల హరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ తిని పోయిన ప్రసాద్, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ బాబు ఈఓపీఆర్డీ పులి శరత్‌బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేమూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం



ఉప్పు శిరీషా



షేక్ ఖాజాబీ

వేమూరు: వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా ఉప్పు శిరీష, వైస్ చైర్‌పర్సన్‌గా షేక్ ఖాజాబీ సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు యార్డు సెక్రటరీ అంజిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, బాపట్ల అర్బన్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు పాల్గొంటారని ఆయన తెలిపారు. కొల్లూరు మండలానికి చెందిన ఉప్పు శిరీషా కొల్లూరు గ్రామం నుంచి ర్యాలీతో వచ్చి ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన తెలిపారు. వేమూరు మండలంలోని జంపని గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ ర్యాలీగా వచ్చి.. ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

వంతెన దాటాలంటేనే వణుకు..!



శిథిలావస్థలో సైడు వాల్



శిథిలావస్థకు చేరిన చోడిపాలెం వంతెన

పిట్టలవానిపాలెం: మండలంలోని భవనంవారిపాలెం శివారు చోడిపాలెం నుంచి నదిముల్లాయపాలెం మీదుగా చందోలు వైపు వెళ్లేందుకు చోడిపాలెం సమీపంలో ఆరెమండ్ల కాలువపై వంతెనను సుమారు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించారు. కొన్నేళ్లుగా వంతెన శిథిలావస్థకు చేరి, ఇనుప చువ్వలు బయట పడ్డాయి. ఏ క్షణంలో కూలిపోతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వంతెన విషయమై.. అనేకసార్లు అధికారులకు వివరించినా.. పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ వంతెనను తొలగించి, నూతన వంతెన నిర్మించేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గతంలో అనేక సార్లు వంతెన విషయం అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోలేదు. ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని స్థితిలో వంతెన ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

–చిరసాని రామిరెడ్డి, గ్రామస్తుడు, చోడిపాలెం.

వంతెన అవసరం ఉంది



ఆరెమండ్ల చానెల్‌పై శిథిలావస్థకు చేరిన వంతెనను తక్షణమే తొలగించి, నూతన వంతెన నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వంతెన నిర్మించి ఐదు దశాబ్దాలకు పైగా కావడంతో శిథిలస్థితికి చేరుకుంది. ఇనుప చువ్వలు బయట పడి ఏ క్షణంలో కూలిపోతుందో అన్నట్లుగా ఉంది.

–దంటు రవీంద్రరెడ్డి, గ్రామస్తుడు, చోడిపాలెం

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చుండూరు(వేమూరు): చుండూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపల్ ఎం.లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తులు గురుకుల పాఠశాలలో అందజేయాలని పేర్కొన్నారు. బీసీ–2, ఎస్టీ–3, ఎస్సీ–25, బీసీ(సీ)–10 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 97030 96428, 99660 08141 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

పెదపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని పెదపూడి గ్రామ మాజీ సర్పంచ్ తుమ్మల రామచంద్రరావు 31 వర్ధంతి సందర్భంగా ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన కుమారుడు తుమ్మల శివరామోహనరావు 300 మందికి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డపనేని సుధీర్, ఎం.ఆనంద్, జాస్తి సాంబశివరావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు ఆహ్వానం

భట్టిప్రోలు: పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉత్తీర్ణులైన పద్మశాలీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరి కటకం సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దేపల్లి, భట్టిప్రోలు, ఐలవరం, కనగాల గ్రామాల పరిధిలోని ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ట్రిపుల్ ఐటీ, బీటెక్, ఎమ్మెస్సీ ఆపై చదువుతున్న వారు ఆగష్టు 15లోగా ఆర్గనైజింగ్ సెక్రటరీలకు రేషన్, విద్యార్థత ఐడీ సబ్‌మిట్ చేయాలన్నారు. ఐలవరం, కనగాల ప్రాంత విద్యార్థులు బ్రాంచ్ సెక్రటరి సాంబశివరావును సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు కర్లపాలెంలో 'జగనన్న సురక్ష'

కర్లపాలెం: కర్లపాలెం గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సభకు ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



మహాసభకు తరలి వెళ్తున్న రేషన్ డీలర్లు

పిట్టలవానిపాలెం: రేషన్ డీలర్లు తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా చందోలులో వారు విలేకరులతో మాట్లాడారు. 2012లో చనిపోయిన రేషన్ డీలర్‌కు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. కానీ, ఆ జీవోను తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. క్వింటాకు రూ.100లుగా ఉన్న కమీషన్‌ను రూ.200లకు పెంచాలన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రస్థాయిలో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన జగనన్న

- ఎంపీపీ మోపిదేవి వెంకటరమణారావు
- అడవులదీవిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రభుత్వ పథకాలను మహిళకు వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: పరిపాలనలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండలంలోని అడవులదీవి సచివాలయం–1 పరిధిలోని రజకపాలెం, భీమావారిపాలెం, పల్లెపాలెం, చంద్రమౌళినగర్, గుణ్ణంతిప్ప, మెయిన్ సెంటర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడారు. సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌ది అని అన్నారు. అలాంటి గొప్ప నాయకుడి వెంట ప్రజలు నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ఓటు అనే ఆయుధంతో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలనే ఆకాంక్షతో ప్రజలు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అదేవిధంగా ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని మహిళలకు వివరించారు. జగనన్నకు తోడుగా ఉండాలని కోరారు. గుణ్ణంతిప్ప గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం ఎంపీ మోపిదేవి అందించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, ఆర్యవైశ్య, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఓటరు జాబితా



లంకెవానిదిబ్బలో ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు మల్లికార్జునరావు

రేపల్లె: ఓటరు జాబితాను నిష్పక్షపాతంగా తయారు చేసేందుకు బీఎల్వోలు, అధికారులు పనిచేయాలని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. మండలంలో జరుగుతున్న ఓటర్ల ఇంటింటి సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటర్లకు, బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. నెల రోజుల పాటు జరగనున్న సర్వేలో ఓటర్ల జాబితాలోని తప్పొప్పులను సవరించటంతో పాటు వంద సంవత్సరాలు నిండిన ఓటర్ల వివరాలను, ఒకే డోరు నంబరుపై పది కంటే అదనంగా నమోదైన ఓటర్ల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. సర్వేలో రాజకీయాలకు తావులేకుండా మృతుల ఓట్లను తొలగించటంతో పాటు డబుల్ ఎంట్రీలను గుర్తించాలని తెలిపారు. లంకెవానిదిబ్బ, రాజుకాల్వ, గంగడిపాలెం, పిరాట్లంక తదితర గ్రామాలలో పర్యటించి సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు

బాపట్లటౌన్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని తెలిపారు. పోలీస్ శాఖ ఆదేశాలను, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా ఇమ్మడిశెట్టివారి దేవర కొలుపులు



దేవర కొలుపులు సందర్భంగా ఊరేగింపు

బాపట్ల: బాపట్ల పట్టణం ఇమ్మడిశెట్టివారి పాలెంలో ఇమ్మడిశెట్టివారి ఇంటి దేవర కొలుపులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇమ్మడిశెట్టి వారి ఆరాధ్య దైవం రేణుకమ్మ – యల్లమ్మ , పల్నాటి వీర్లంకమ్మ అమ్మవార్లతో పాటు చెన్నకేశవ స్వామి వారిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ.. గ్రామ పెద్దలు సాంప్రదాయ బద్ధంగా కొలుపులను నిర్వహించారు. ఆదివారం అమ్మవారి స్నాన ఘట్టాన్ని అత్యంత భక్తి ప్రదంగా చేపట్టారు. సాంప్రదాయ క్రతువులు..... 'బియ్యపు కొల,' పుట్ట బంగారం' 'చెన్న కేశవస్వామి జల బిందెలు' వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనక తప్పెట్లు, మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాతంగి ఆటపాటలతో ఆద్యంతం రసవత్తరంగా కనుల పండుగగా ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం కొనసాగింది. ఇంటి దేవర రేణుక – యల్లమ్మ మొక్కుబడులు చెల్లించుకోవాల్సిన భక్త జనులు ఆదివారం పాల పొంగళ్లు నైవేద్యం సమర్పించి, తమ మొక్కులు తీర్చుకొన్నారు. రాత్రి గ్రామ ప్రజలందరికీ అన్న ప్రసాద వినియోగం ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దల నేతృత్వంలో కట్టుబాట్లు, సాంప్రదాయ పద్ధతిలో కొలువులు చేపట్టారు.

భట్టిప్రోలులో కేంద్ర బృందం పరిశీలన



పాఠశాలను పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు

భట్టిప్రోలు: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలులో ఆదివారం కేంద్రం బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులైన ఎస్‌హెచ్‌పీవో మోహన్, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, పంచాయతీ సిబ్బందితో కలసి భట్టిప్రోలులోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామంలోని మురుగు నీటి కాల్వల పారుదల వంటి వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పెరికల శ్యామ్, దారా చెన్నయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప యోధుడు ఆజాద్



ఆజాద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బాపట్ల అర్బన్ దేశం గర్వించదగ్గ గొప్ప స్వాతంత్ర్య పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని జిల్లా పరిశ్రమల అధికారి మదన్ మోహన్‌శెట్టి అన్నారు. ఆదివారం ఆజాద్ జయంతి సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మదన్ మోహన్‌శెట్టి మాట్లాడుతూ ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి, వారికి సింహ స్వప్నంగా ఆజాద్ నిలిచారన్నారు. సాయుధ పోరాట బాట పట్టిన తొలి విప్లవకారుడు ఆజాద్ అని అన్నారు. భగత్‌సింగ్ వంటి త్యాగధనులకు మార్గదర్శకత్వం వహించారని చెప్పారు. ఆజాద్ ఆశయాల సాధన కోసం పోరాడటమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, న్యాయవాదులు బాషా, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.